APTEL/2008/28200




# తెలంగాణ ఫోకస్

తెలుగు దినపత్రిక

ప్రజల తెలంగాణ ప్రతిబింబం

సంపుటి: 16 సంచిక : 33 కరీంనగర్ మంగళవారం, జూన్ 04, 2024 ఎడిటర్ : బోనగిరి నర్సింగ్ పేజీలు : 8 రూ. 2 రూపాయిలు


## బక్రీద్ పండుగకు సెలవును ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం

హైదరాబాద్ జూన్ 3 : ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు చేసుకునే బక్రీద్ పండుగ సెలవును తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. తెలంగాణ ప్రభుత్వ క్యాలెండర్ ప్రకారం ఈ పండుగ జూన్ 17న ప్రకటించింది. అయితే అర్ధచంద్రాకార నెలవంక దర్శనంపైనే పండుగ తేదీ నిర్ధారణ కానున్నది. నెలవంక జూన్ 7న కనిపిస్తే బక్రీద్ జూన్ 17 ఉంటుంది. లేకుంటే జూన్ 18న ఉంటుంది.బక్రీద్ పండుగకు ముందే వివిధ దుకాణాలలో అమ్మకాలు ఊపందుకున్నాయి. బక్రీద్ కు ముందే పశు వర్తకులు ఆంధ్రప్రదేశ్, కర్నాటక, యూపీ, మహారాష్ట్ర నుంచి హైదరాబాద్ కు వస్తున్నారు. వారంతా తాత్కాలిక మార్కెట్లలో తమ జీవాలను అమ్ముతున్నారు.బక్రీద్ పండుగకు సెలవు ఇవ్వడంతో పాటు జూన్ 25న వచ్చే ఈద్–ఈ–ఘదీర్ కు కూడా తెలంగాణ ప్రభుత్వం సెలవు ప్రకటించింది. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం 12వ నెల ధుల్ హిజా&ఝ 10 రోజున బక్రీద్ పండుగ చేసకుంటారు.

## సర్కార్ తీరు మారకపోతే.. జనమే తరిమికొడతారు

నల్గొండ మున్సిపాలిటీలోని పాతబస్తీ హిందూపూర్ వాటర్ ట్యాంకర్‌లో మృతదేహం లభించడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై ట్విట్టర్ (ఎక్స్) వేదికగా నిప్పులు చెరిగారు. ఇది ప్రజా పాలన కాదు.. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే పాలన అని విమర్శించారు. కోతల్లేని కరెంట్ ఇవ్వలేరు.. కోతకొచ్చిన పంటకు సాగునీళ్లు ఇవ్వలేరు.. కోతులు పడి చనిపోయినా వాటర్ ట్యాంకులను పట్టించుకోరని కేటీఆర్ అన్నారు. చివరికి.. నల్గొండలోని నీటిట్యాంకులో పదిరోజులుగా శవం ఉన్నా నిద్రలేవరని మండిపడ్డారు. సాగర్ ఘటన స్మృతిపథం నుంచి చెరిగిపోకముందే.. కాంగ్రెస్ సర్కారులో మళ్లీ అదే నిర్లక్ష్యం.. అదే నిర్లిప్తత.. కనిపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సురక్షిత మంచినీళ్లు కూడా ఇవ్వలేని సర్కారిది ప్రజారోగ్యాన్ని పూర్తిగా గాలికొదిలేసిన గలీజు పాలన ఇది అని ఎద్దేవా చేశారు. మిషన్ భగీరథ పథకంతో.. దశాబ్దాల తాగునీటి తండ్లాటను తీరిస్తే.. కనీసం నీటిట్యాంకుల నిర్వహణ కూడా చేతకాని అసమర్థ ప్రభుత్వమిది అని విమర్శించారు.

## వరల్డ్ రికార్డు సృష్టించిన భారత్ ఓటింగ్

### జీ7 దేశాల్లోని మొత్తం ఓటర్ల కంటే ఈ సంఖ్య 1.5 రెట్లు ఎక్కువ



న్యూ డిల్లీ జూన్ 3 : దేశంలో చరిత్రాత్మక ఎన్నికలు జరిగాయని కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి రాజీవ్‌కుమార్ అన్నారు. ఓటింగ్‌లో భారత్ వరల్డ్ రికార్డు సృష్టించిందని తెలిపారు. ఓటేసిన ప్రతి ఒక్కరికీ మేం ధన్యవాదాలు చెబుతున్నామని అన్నారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్, మహిళా ఓటర్లకు సెల్యూట్ చేశారు.దేశవ్యాప్తంగా 64.20 కోట్ల మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని సీఈసీ రాజీవ్‌కుమార్ తెలిపారు. జీ7 దేశాల్లోని మొత్తం ఓటర్ల కంటే ఈ సంఖ్య 1.5 రెట్లు ఎక్కువ అని పేర్కొన్నారు. ఐరోపా సమాఖ్యలోని 27 దేశాల ఓటర్ల కంటే 2.5 రెట్లు ఎక్కువ అని చెప్పారు. ఈ ఎన్నికల్లో మహిళా ఓటర్లు పోటెత్తారని తెలిపారు. 31.2 కోట్ల మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని చెప్పారు. ఈ ఎన్నికలను 68,763 బృందాలు పర్యవేక్షించాయని.. ఎన్నికల ఏర్పాట్ల కోసం 4 లక్షల వాహనాలను ఉపయోగించామని తెలిపారు. 27 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో రీపోలింగ్ అవసరం రాలేదని చెప్పారు. గత ఎన్నికల్లో 540 చోట్ల రీపోలింగ్ నిర్వహించగా.. ఈసారి ఆ సంఖ్య 39కి తగ్గిందన్నారు. అందులో కేవలం రెండు రాష్ట్రాల్లోనే 25 చోట్ల పోలింగ్ జరిగిందని తెలిపారు.గత నాలుగు దశాబ్దాలతో పోలిస్తే జమ్మూకశ్మీర్‌లో అత్యధిక ఓటింగ్ శాతం నమోదైందని సీఈసీ తెలిపారు. అక్కడ 58.58 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. ఇక ఎన్నికల్లో నగదు ప్రవాహాన్ని విజయవంతంగా అడ్డుకున్నామని వెల్లడించారు. రూ.10వేల కోట్ల నగదు, కానుకలు, డ్రగ్స్, మద్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు స్వాధీనం చేసుకున్నాయని పేర్కొన్నారు.

## తెలంగాణలో 34 కౌంటింగ్ కేంద్రాలు




హైదరాబాద్, జూన్ 3 : తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ కోసం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. తెలంగాణ సహా దేశవ్యాప్తంగా ఉదయం 8 గంటలకు కౌంటిగ్ స్టార్ట్ అవుతుంది. 17 నియోజకవర్గాల్లో ఓట్ల లెక్కింపును పకడ్బందీగా చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా 34 ప్రదేశాల్లో కౌటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. తెలంగాణలో 49 మంది అజర్వర్ల, 2440 మైక్రో అబ్జర్వర్లను నియమించింది ఎన్నికల సంఘం. వీళ్లకు సహాయం చేసేందుకు పది వేల మంది సిబ్బందిని ఈసీ నియమించింది. వీళ్లతోపాటు మరికొందర్ని అదనంగా నియమించారు. అవసరమైనప్పుడు వారి సేవలను కూడా వినియోగించుకుంటారు. తెలంగాణలో ఎక్కువ రౌండ్లు చొప్పదండి, దేవరకొండ యాకూత్పుర లో ఉన్నాయి. అక్కడ 24 రౌండ్లలో కౌంటింగ్ జరగనుంది. అతి తక్కువ ఆర్మూర్, అశ్వరావుపేట, భద్రాచలంలో ఉన్నాయి. ఈ కేంద్రాల్లో కేవలం 13 రౌండ్లలోనే కౌంటిగ్ పూర్తికానుంది. ఈసారి తెలంగాణలో దాదాపు మూడు లక్షల వరకు పోస్టల్ బ్యాలెట్లు వచ్చాయి. చేవెళ్ల, మల్కాజ్‌గిరిలో వీటిని లెక్కిస్తారు. భద్రత విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకుంది ఎన్నికల సంఘం. ప్రతి కేంద్రంలో సీసీకెమెరాలతో నిఘా పెట్టింది. స్ట్రాంగ్ రూమ్ నుంచి కౌంటింగ్ సెంటర్ వరకు ఈవీఎంలు తరలించేటప్పుడు కూడా సీసీటీవీ మానిటరింగ్ ఉంటుందని. దీంతోపాటు 12 బృందాల కేంద్ర బలగాలతో సెక్యూరిటీ ఏర్పాటు చేసింది. లోక్‌సభ ఎన్నికల ఫలితాల విడుదలకు కౌంట్‌డౌన్ మొదలైంది.. మరికొన్ని గంటల్లో దేశవ్యాప్తంగా కౌంటింగ్ ప్రారంభం కానుంది.. ఫలితాలు కూడా వెనువెంటనే విడుదల కానున్నాయి. లోక్‌సభతోపాటు.. ఆంధ్రప్రదేశ్, ఒడిషా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై దేశవ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ నెలకొంది. మంగళవారం (జూన్4) ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది.. మొదటగా బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కొనసాగనుంది.. ఆ వెంటనే 8.30 నుంచి ఈవీఎంల లెక్కింపు కొనసాగుతుంది. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ లేనిచోట 8గంటలకే ఈవీఎం ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. 543 లోక్‌సభ స్థానాల్లో.. ఇప్పటికే సూరత్ నియోజకవర్గంలో బీజేపీ ఏకగ్రీవంగా గెలిచింది. 542 స్థానాలకు కౌంటింగ్ జరుగుతుంది.. దీనికోసం కేంద్ర ఎన్నికల సంఘం భారీ ఏర్పాట్లు చేసింది.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా.. భారీగా బలగాలను మోహరించడంతోపాటు.. అధికారులకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలిచ్చింది. అయితే, దాదాపు అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాల పహరాలో కౌంటింగ్ జరగనుంది. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ 8 గంటలకు మొదలై.. కొన్ని నియోజకవర్గాల్లో రాత్రి వరకు కొనసాగనుంది. ఆయా నియోజకవర్గాల్లో గెలుపు, ఓటముల ప్రకటన తర్వాత ఎన్నికల అధికారులు సర్టిఫికెట్లను అందజేస్తారు.. కాగా.. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ.. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండి కూటమి మధ్య తీవ్ర పోటీ ఉండనుంది. అయితే.. ఎగ్జిట్ పోల్స్ మొత్తం మళ్లీ మోదీ 3.0 సర్కార్ వస్తుందని చెప్పిన నేపథ్యంలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అయితే, ఉదయం 8గంటలకు కౌంటింగ్ ప్రారంభమైన తర్వాత 11 గంటల వరకు ట్రెండ్స్ వెలువడనున్నాయి. అలాగే.. మధ్యాహ్నం 12 నుంచి 1 గంట లోపు ఫలితాలపై ఓ అంచనా వస్తుందని ఎన్నికల అధికారులు పేర్కొంటున్నారు.

కౌంటింగ్ విషయంలో జాగ్రత్తగా వుండాలి : సీఎం రేవంత్

పార్లమెంట్ అభ్యర్థులు, పార్లమెంట్ ఇన్చార్జ్ లు, మంత్రులు, ఏఐసీసీ సెక్రెటరీలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ఇంచార్జ్ దీపాదాస్ మున్షీ, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, ఏఐసీసీ సెక్రటరీలు, ఎంపీ అభ్యర్థులు పాల్గోన్నారు,

## పాక్‌కు 'బ్రహ్మోస్' లీక్ చేసిన ఇంజినీర్‌కు యావజీవ శిక్ష విధించిన కోర్టు



నాగ్‌పూర్, జూన్ 03: భారత్ పొరుగునున్న దాయాది దేశం పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ సంస్థ ఐఎస్ఐకి బ్రహ్మోస్ మాజీ ఇంజినీర్ నిషాంత్ అగర్వాల్ కీలక సమాచారం అందించారనే అభియోగాలు రుజువయ్యాయి. ఈ నేపథ్యంలో నాగ్‌పూర్ సెషన్స్ కోర్టు అతడికి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష విధించింది. అలాగే రూ.3 వేల జరిమానా చెల్లించాలని అతడిని ఆదేశించింది. ఈ మేరకు అడిషనల్ సెషన్స్ కోర్టు జడ్జి ఎంవి దేశ్‌పాండే సోమవారం తీర్పు వెలువరించారు. నాగ్‌పూర్‌లోని కంపెనీ మిసైల్ సెంటర్‌లో టెక్నికల్ రీసర్చ్ సెక్షన్‌లో అగర్వాల్ ఉద్యోగిగా విధులు నిర్వహించేవాడు. ఆ క్రమంలో నాలుగళ్లు బ్రహ్మోస్ క్షిపణి ప్రాజెక్ట్‌లో ఇంజినీర్‌గా పని చేశారు. దీంతో ప్రాజెక్ట్‌కు సంబంధించిన అత్యంత సున్నితమైన సాంకేతిక అంశాలను అతడు పాక్ ఐఎస్ఐకు అందించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. 2018లో దీనిపై ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రల్లో మిలటరీ ఇంటెలిజెన్స్, యాంటీ టెర్రరిజం స్క్వాడ్ సంయుక్తంగా దర్యాప్తు చేపట్టాయి. అనంతరం నిషాంత్‌ను అరెస్ట్ చేసి.. అతడిపై ఇండియన్ పీనల్ కోడ్‌లోని పలు సెక్షన్లతోపాటు అధికారిక రహస్యాల చట్టం కింద కేసు నమోదు చేశాయి. ఇంకోవైపు ఇదే కేసులో ముంబై హైకోర్టు నాగ్‌పూర్ బెంచ్ నిషాంత్‌కు ఈ ఏడాది ఏప్రిల్‌లో బెయిల్ మంజూరు చేసింది. బ్రహ్మోస్ క్షిపణిని భారత్, రష్యా సంయుక్తంగా తయారు చేసిన సంగతి తెలిసిందే.

## తెలంగాణను తాకిన నైరుతి రుతుపవనాలు!



హైదరాబాద్, జూన్ 3: దేశంలో నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. నాలుగు రోజుల క్రితం మే 30న కేరళలోకి ప్రవేశించిన రుతుపవనాలు నిన్న కర్ణాటక మీదుగా ఏపీలోని రాయలసీమలోకి ఎంటర్ అయ్యాయి. ఇవాళ తెలంగాణను తాకాయి. నాగర్‌కర్నూలు, గద్వాల, నల్గొండ మీదుగా ఈ రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించాయి. ప్రస్తుతం రాష్ట్రంలో రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. సాధారణంగా జూన్ రెండో వారంలో తెలంగాణలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశిస్తుంటాయి. కానీ ఈ సారి వారం ముందుగానే రాష్ట్రంలోకి ఆగమనం జరిగింది. ఈ సారి సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఉపరితల ఆవర్తనం కారణంగా రాష్ట్రంలోని పలుచోట్లు సోమవారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ పేర్కొంది.

## రూ.1100 కోట్ల నేరం జరిగింది

### కవిత పాత్ర ఉంది- ఈడీ చార్జ్‌షీట్

ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కవితపైన దాఖలు చేసిన చార్జ్ షీటులో ఈడీ కీలక అంశాలు ప్రస్తావించింది.



కవితపై అభియోగాలు నమోదు చేసిన ఈడీ.. 1100 కోట్ల రూపాయల నేరం జరిగిందని పేర్కొంది. రూ.192 కోట్ల లాభాలను ఇండో స్పిరిట్ పొందిందని తెలిపింది. 100 కోట్ల ముడుపులు ఆమ్ ఆద్మీ పార్టీకి ఇచ్చారని ఈడీ అధికారులు చెప్పారు. డిజిటల్ ఆధారాలను కవిత ధ్వంసం చేశారని తెలిపారు. రూ.292 కోట్ల నేరంలో కవిత పాత్ర ఉందని తెలిపింది ఈడీ. పీఎంఎల్ఏ సెక్షన్ 44, 45 కింద సప్లమెంటరీ ఛార్జ్ షీట్ ను దాఖలు చేసిన ఈడీ. పీఎంఎల్ఏ సెక్షన్ 17 ప్రకారం తెలంగాణ, ఢిల్లీ, ఏపీ, మహారాష్ట్ర, పంజాబ్, హర్యానా, తమిళనాడు ఇతర ప్రాంతాల్లోని 24 స్థానాల్లో సోదాలు నిర్వహించామని చెప్పింది. ఇప్పటివరకు లిక్కర్ స్కాంలో 18 మందిని అరెస్ట్ చేసినట్లు ఈడీ తెలిపింది. ఈ కేసులో బెయిల్ పై ఉన్న శరత్ చంద్రా రెడ్డిని ఏ7గా, రాఘవ మాగుంటను ఏ18గా, ఏ 32గా కవిత పేరును ఈడీ పేర్కొంది. మొత్తం 49 మందిని ఈడీ అధికారులు విచారించారు. పీఎంఎల్ ఏ సెక్షన్ 50(2), (3) ప్రకారం.. కవిత, మాగుంట శ్రీనివాసులు, రాఘవ మాగుంట, గోపి కుమరన్, శరత్ చంద్రా రెడ్డి, సమీర్ మహేంద్రు, దినేశ్ అరోరా, అరుణ్ పిళ్లై, వి. శ్రీనివాస్ ఇతరుల వాంగ్మూలాల రికార్డు చేసినట్లు ఈడీ తెలిపింది. మరోవైపు లిక్కర్ పాలసీ సీబీఐ కేసులో ఎమ్మెల్సీ కవిత జ్యుడీషియల్ కస్టడీని పొడిగించారు. జూన్ 7వరకు కస్టడీ పొడిగిస్తూ రౌస్ అవెన్యూ కోర్టు తీర్పు చెప్పింది. అదే రోజున సీబీఐ చార్జ్ షీటు దాఖలు చేయనుంది.

## సమాచారం ఇవ్వకపోతే చర్యలు.. జైరామ్ రమేష్‌కు ఈసీ అల్టిమేటం




న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల అనంతరం 150 మంది జిల్లా మెజిస్ట్రేట్లకు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఫోన్ చేసి వారిని ప్రభావితం చేసేందుకు ప్రయత్నించారని కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేష్ ఇటీవల చేసిన వ్యాఖ్యల వ్యవహారం ముదురుతోంది. తన ఆరోపణలను రుజువు చేసే ఆధారాలను ఆదివారం సాయంత్రంలోగా తమకు సమర్పించాలని ఇప్పటికే జైరామ్ రమేష్‌ను ఎన్నికల కమిషన్ కోరింది. ఈ నేపథ్యంలో తనకు మరో వారం రోజులు సమయం ఇవ్వాలని ఈసీని జైరామ్ రమేష్ సోమవారంనాడు కోరారు. అయితే ఆయన అభ్యర్ధనను ఈసీ తోసిపుచ్చింది. ఈమేరకు జైరామ్ రమేష్‌కు ఒక లేఖ రాసింది. ఈరోజు రాత్రి 7 గంటల్లోగా తమకు ఆధారాలను అందజేయాలని ఆదేశించింది. "గడువు పొడిగించాలని మీరు చేసుకున్న విజ్ఞప్తిని కమిషన్ నిర్ద్వంద్వంగా త్రోసిపుచ్చుతోంది. మీరు చేసిన ఆరోపణలను రుజువు చేసే ఆధారాలను ఈరోజు (జూన్ 3) రాత్రి 7 గంటల్లోగా మాకు అందజేయాలి.

## పోలీసుల అదుపులో హేమ

బెంగళూరు, జూన్ 3 : బెంగుళూరు రేవ్ పార్టీ కేసు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ కేసులో మొత్తం 100 మందికి బ్లడ్ శాంపిల్స్ టెస్ట్ చేయగా.. 86 మందికి డ్రగ్స్ పాజిటివ్ వచ్చింది. ఇందులో ఎక్కువగా తెలుగువారు, టాలీవుడ్ ఇండస్ట్రీకి చెందిన నటీనటులు ఉండడంతో సినీ పరిశ్రమను షేక్ చేసింది. ఈ కేసులో ప్రముఖంగా నటి హేమ పేరు మారుమోగింది. బెంగుళూరు రేవ్ పార్టీలో నటి హేమ పాల్గొన్నట్లు పోలీసులు తెలుపగా.. అక్కడ తను లేనంటూ బుకాయించే ప్రయత్నం చేసింది. కానీ పోలీసులు ఆధారాలతో సహా బయటపెట్టడంతో హేమ ప్లాన్ బెడిసికొట్టింది. ఇక రేవ్ పార్టీలో హేమ డ్రగ్స్ తీసుకున్నట్లు తేలడంతో ఆమెకు పోలీసులు నోటీసులు పంపించారు. మే 27న విచారణకు హాజరు కావాలంటూ నోటీసులు పంపించగా.. గైర్హాజయ్యింది. తాజాగా నటి హేమకు బెంగుళూరు పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలుస్తోంది.

## తెలంగాణ లోక్‌సభ ఎన్నికల ఎఫెక్ట్.. గుట్టలు గుట్టల నోట్ల కట్టలు!



హైదరాబాద్, జూన్ 3: తెలంగాణలో 17 లోక్‌సభ స్థానాలకు మే 13న ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. ఎన్నికల నేపథ్యంలో మార్చి 16 నుంచి రాష్ట్రంలో మోడల్ కోడ్ అమల్లోకి వచ్చింది. నాటి నుంచి నేటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల దాదాపు రూ.200 కోట్ల విలువైన నగదు, లిక్కర్, బంగారాభరణాలు, నార్కొటిక్ డ్రగ్స్ సీజ్ చేసినట్లు తెలంగాణ ఎన్నికల అధికారులు సోమవారం (జూన్ 3) విడుదల చేసిన మీడియా నివేదికలో వెల్లడించారు. వీటిని మార్చి 16 నుంచి జూన్ 3వ తేదీ మధ్యలో పోలీసులు సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల కోడ్ జూన్ 6వ తేదీ వరకు అమల్లో ఉండనుంది. రూ. 99.16 కోట్ల నగదు, రూ. 11.48 కోట్ల విలువ చేసే మద్యం, రూ. 14.52 కోట్ల విలువైన నార్కోటిక్ డ్రగ్స్, రూ. 63.19 కోట్ల విలువ చేసే ఆభరణాలు, రూ. 11.91 కోట్ల విలువ చేసే ఇతర వస్తువులను సీజ్ చేసినట్లు ప్రెస్ నోట్‌లో పేర్కొన్నారు. మొత్తంగా 2024 లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా రూ.200 కోట్ల 27 లక్షల 60 వేల విలువైన తాయిళాలు పట్టుబడ్డాయి. వీటిల్లో ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ అధికారులు రూ.50.73 కోట్లు సీజ్ చేయగా.. రాష్ట్ర పోలీసులు రూ.149.54 కోట్లు సీజ్ చేశారు. అలాగే 7,272 అక్రమ ఆయుధాలు, 20 లైసెన్స్ ఉన్న ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాగా 2019 ఎన్నికల్లో కేవలం 46.3 కోట్ల విలువ చేసే నగదు, బంగారు ఆభరణాలు, మద్యం పోలీసులు సీజ్ చేయగా.. ఈ ఏడాది ఎన్నికల్లో దాదాపు మూడింతలు పెరిగింది. పొలిటికల్ లీడర్లు ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు రాబట్టడానికి కాసులు రాల్చడం, మద్యం ఏరులై పారేలా చేయడం షరా మామూలే. అయితే ఈసారి అదికాస్త సృతి మించిందనే చెప్పాలి. ఇకపోతే మంగళవారం (జూన్ 4) ఓట్ల లెక్కింపు చేపట్టనున్న సంగతి తెలిసిందే. రేపు సాయంత్రానికి నేతల తలరాతలు మార్చే ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి.



# కరీంనగర్ కమీషనరేట్ వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు: పోలీస్ కమిషనర్

కరీంనగర్ జిల్లా: జూన్ 03 : లోకసభ ఎన్నికల లెక్కింపు జూన్ 4న జరగనున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కరీంనగర్ కమిషనరేట్ వ్యాప్తంగా 144 సెక్షన్ అమలుచేస్తూ కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఉత్తర్వులు 4న ఉద యం 6 గంటల నుంచి 5వ తేదీ ఉదయం 6గంటల వరకు అమల్లో ఉంటాయని తెలిపారు. ఈ ఉత్తర్వుల ప్రకారం ఐదుగురికి మించి గుమికూడరాదని తెలిపారు.

# రాజన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు



వేములవాడ జూన్ 3 : వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామి దర్శనానికి సోమవారం భక్తులు పోటెత్తారు. భక్తులు వేకువజాము నుండే తలనీలాలు సమర్పించి, ధర్మ గుండంలో పుణ్య స్నానాలు ఆచరించి, కోడె మొక్కు చెల్లింపుకై గంటల కొద్ది క్యూ లైన్ లో నిల్చొని మొక్కులు చెల్లించుకుంటున్నారు. విద్యార్థులకు సెలవులు ముగుస్తుండడంతో భక్తులు రద్దీ అనూహ్యంగా పెరిగింది. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ధర్మదర్శనం, వంద రూపాయల శీఘ్ర దర్శనం, కోడెల క్యూ లైన్లు పూర్తిగా భక్తులతో నిండిపోయాయి.స్వామి వారి దర్శనానికి దాదాపు 4 గంటల సమయం పడుతోంది.. భక్తుల రాకతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. వాహనాలతో పార్కింగ్ స్థలం పూర్తిగా నిండిపోయింది. రాజన్నను దర్శించుకున్న భక్తులు అనుబంధ ఆలయాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాటు చేశారు. ఆలయ ఈవో రామకృష్ణారావు భక్తులు నిల్చుని ఉన్న క్యూలైన్లను పరిశీలించి, ఎప్పటికప్పుడు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

# లోక్ సభ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సర్వం

హైదరాబాద్: జూన్ 03 : తెలంగాణ రాష్ట్రంలో లోక్ సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు నకు సర్వం సిద్ధమైనట్టు ఎన్నికల అధికారులు తెలిపారు. మంగళవారం ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. 17 నియోజకవర్గాల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు సహా 525 మంది పోటీలో ఉన్నారు. 2,20,24,806 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాల నిఘా తోపాటు, మూడంచెల భద్రత ఉంటుందని అధికారులు తెలిపారు. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా 144 సెక్షన్, మద్యం దుకాణాల బంద్ అంటుందిని చెప్పారు. 120 హాళ్లలో 1855 టేబుళ్లపై ఓట్ల లెక్కింపు 2.18లక్షల పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు 19 హాళ్లలో 276 టేబుళ్లు సాయంత్రం 4 వరకు ఓట్ల లెక్కింపు పూర్తయ్యే అవకాశం... ఏడు నియోజకవర్గాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు పెద్దపెల్లి జిల్లా పరిధిలోని జేఎన్టీయూ కాలేజీ లో రేపు ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది చొప్పదండి, దేవరకొండ, యాఖుత్‌పురా,అసెంబ్లీ సెగ్మెంట్లలో 21 రౌండ్లలో ఓట్ల లెక్కింపు ఆర్మూరు, భద్రాచలం, అశ్వారావుపేట అసెంబ్లీ సెగ్మెంట్లలో 13 రౌండ్లలో లెక్కింపు ఓట్ల లెక్కింపునకు సుమారు.

# గులాబీకి ఇలా.. అయిందీ...ఏటీ



**హైదరాబాద్, జూన్:** తెలంగాణ ఉద్యమ పార్టీ.. తెలంగాణ సాధన కోసమే ఆవిర్భవించిన పార్టీ. ఎవరు అవునన్నా.. కాదన్న బీఆర్ఎస్ అలియాస్ టీఆర్ఎస్ ఏర్పాటు చేకపోతే.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యమయ్యేది కాదు. ఇందుకు గత చరిత్రే నిదర్శనం. తెలంగాణ ఏర్పాటు తర్వాత ఉద్యమ పార్టీకి తెలంగాణ ప్రజలు పట్టం కట్టారు. 2014లో బీఆర్ఎస్‌ను గెలిపించారు. పార్టీ అధినేత, తెలంగాణ ఉద్యమ సారథి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేశారు. 2018లో ముందస్తు ఎన్నికలకు వెళ్లినా.. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీనే అధికారంలో ఉండాలని భావించారు. మరోమారు కేసీఆర్‌కు పట్టం కట్టారు. అయితే, రెండు పర్యాయాలు ప్రజలు ఇచ్చిన అధికారంతో కేసీఆర్ కుటుంబానికి అహంకారం తలకెక్కింది. ఎంతలా అంటే.. పదవి ఇచ్చిన ప్రజలనే శాసించే స్థాయికి.. తామే ఏం చేసినా చెల్లుతుంది.. తెలంగాణ ప్రజలు తాము ఏం చెప్పినా వింటారు అనేలా పరిస్థితి తయారైంది. ఈ అహంకారతోనే కేసీఆర్ గత మూడేళ్లుగా విర్రవీగారు. ముఖ్యమంత్రి పదవి దాటి ప్రధాని పీఠంపై కన్నేసే స్థాయికి పెరిగింది. ఈ క్రమంలోనే ఉద్యమ పార్టీ టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చేలా చేసింది. పార్టీలో మార్పులు, ప్రభుత్వంలో నిర్ణయాలన్నీ ఏకపక్షమే.ఇక పెరిగిన సంపద, పదవులు, అహంకారంతో కేసీఆర్‌కు ప్రధాని పదవిపై ఆశ పుట్టింది. దీని కోసం పార్టీ పేరునే మార్చేశారు. ఇదే క్రమంలో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని తన దారికి తెచ్చెకునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో మోదీతో గిచ్చి కయ్యాం పెట్టుకున్నారు. ఏకంగా ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎస్ సంతోష్‌ను జైల్లో పెట్టేందుకు వ్యూహరచరన చేశారు. బీఆర్ఎస్‌పై అసంతృప్తితో ఉన్న ఎమ్మెల్యేలు బీజేపీలో చేరాలని నిర్ణయించుకున్న విషయం తెలుసుకుని వారి ఫోన్లు ట్యాప్ చేసి బీఎల్.సంతోష్‌ను జైల్లో పెట్టేందుకు దుస్సాహసానికి ఒడిగట్టారు. ఈ విషయాన్ని ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టు అయిన రాధాకిషన్‌రావే స్వయంగా తన వాగ్మూలంలో వెల్లడించారు.కేసీఆర్ ఈ దుస్సాహసానికి కారణం కూడా ఉంది. ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో కేసీఆర్ కూతురు ఉన్నట్లు ఈడీ గుర్తించింది. దీంతో ఆమె అరెస్టు కాకుండా ఉండేందుకు, అందే సమయంలో కేంద్రంలో బీజేపీని దెబ్బతీసేందుకు ఒక్క దెబ్బకు రెండు పిట్టలు అన్నట్లుగా తెలంగాణ పోలీసులతో బీజేపీ నేత అరెస్టుకు ప్లాన్ చేశారు. ఈమేరకు తెలంగాణ పోలీసులను ప్రత్యేక విమానంలో ఢిల్లీకి కూడా పంపించారు. కోర్టు స్టేతో అరెస్ట్ ఆగింది. తర్వాత బీజేపీ గేమ్ స్టార్ట్ చేసింది. దీంతో కవిత జైలుకు వెళ్లడంతోపాటు, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమికి కారణమైంది. ఇప్పుడు పార్టీ సంక్షోభం ఎదుర్కొంటుంది. లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత బీఆర్ఎస్ అడ్రస్ గల్లంతయ్యే ప్రమాదం పొంచి ఉంది. దీనికంతటికీ కారణం.. కేసీఆర్ బీజేపీ నేత బీఎల్. సంతోష్‌ను అరెస్ట్ చేయాలని చూడడమే.అసెంబ్లీ ఎన్నికల్లో కూడా బీజేపీ ఓడినా మంచిదే కానీ, బీఆర్ఎస్ గెలవ కూడదు అన్న లక్ష్యంతో బీజేపీ అధిష్టానం పనిచేసింది. బండి సంజయ్ నేతృత్వంలో ఆ పార్టీ ఎన్నికలకు వెళ్లి ఉంటే.. గెలుపు ఖాయమయ్యేది. కానీ, ఎక్కడో అనుమానం ఉండడంతో తాము ఓడినా మంచిదే కానీ బీఆర్ఎస్ గెలవ కూడదన్న లక్ష్యంతో బీజేపీ పనిచేసింది. ఇదే కాంగ్రెస్‌కు కలిసి వచ్చింది. బీఆర్ఎస్‌ను గద్దె దించింది. బీజేపీ గట్టిగా పోరాడితే రాష్ట్రంలో ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలుతాయని గులాబీ బాస్ భావించారు. హంగ్ ప్రభుత్వ ఏర్పడుతుందని, కాంగ్రెస్‌తో కలిసి సర్కార్ ఏర్పాటు చేయవచ్చని లెక్కలు వేసుకున్నారు. కానీ, అది ఫలించకుండా బీజేపీ వ్యూహాత్మకంగా పావులు కదిపింది. కిషన్‌రెడ్డిని తెలంగాణ అధ్యక్షుడిని చేయడం ద్వారా రేసు నుంచి తప్పుకున్నట్లు సంకేతాలు ఇచ్చింది. దీంతో తెలంగాణ ఓటర్లు కాంగ్రెస్‌వైపు మొగ్గు చూపారు. తర్వాత కవితను తిహార్ జైలుకు పంపింది. తమ జోలికి వస్తే ఎలాంటి పరిణామాలు ఉంటాయో కేసీఆర్‌కు ప్రత్యక్షంగా చూపిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత కేసీఆర్ అసలు పరీక్ష ఎదుర్కొనాల్సి ఉంటుంది

# వేగంగా కదులుతున్న నైరుతి

హైదరాబాద్, జూన్ 3 : దేశంలోకి నైరుతి రుతుపవనాలు) ముందే ప్రవేశించడంతోపాటు చాలా వేగంగా దేశం నలువైపులా విస్తరిస్తున్నాయి. వీటి ప్రభావం అప్పుడే తెలుగు రాష్ట్రాల్లో కనిపిస్తోంది. తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురవడంతోపాటు....వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. గత నెల 30న కేరళను తాకిన రుతుపవనాలు...కర్ణాటక( మీదుగా రాయలసీమలోకి ప్రవేశించాయి. ఈనెల 6న రుతుపవనాలు తెలంగాణను తాకే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ తెలిపింది. ఆదివారం హైదరాబాద్‌తోపాటు పలు జిల్లాల్లో వర్షం కురిసింది. కేరళలోకి ముందగానే ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు....కర్ణాటక మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించాయి. చాలా రోజుల తర్వాత జూన్ 1, 2 తేదీల్లోనే రుతుపనాలు రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభించడానికి రుతుపవనాలు రాక ఎంతో ఆవశ్యకం. రాయలసీమ జిల్లాల్లోకి ప్రవేశించిన రుతుపవనాలు క్రమంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్నాయి. దీని ప్రభావంతో ఏపీలోనూ పలుచోట్ల చిరుజల్లులు కురిశాయి. ఈనెల 6న రుతుపవనాలు తెలంగాణను తాకే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. రాయలసీమలోకి రుతుపవనాల రాకతో తెలంగాణలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఆదివారం మొత్తం మబ్బులు పట్టి చిరుజల్లులు కురిశాయి. హైదారాబాద్‌లో అయితే భారీ వర్షమే కురిసింది. నైరుతి రుతుపవనాల రాకను పురస్కరించుకుని తెలంగాణ జిల్లాల్లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. అసిఫాబాద్ జిల్లా వాంకిడిలో ఈదురుగాలులకు ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. జగిత్యాల జిల్లా కోరుట్లలో పిడుగుపడి చెట్లు నేలకూలాయి. రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ వెల్లడించింది.

# కౌంటింగ్ విధులు పకడ్బందీగా నిర్వహించాలి : కలెక్టర్, పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్




రామగిరి, జూన్ -03: పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ విధులను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్, పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం కలెక్టర్, పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్ రామగిరిలోని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ నిర్వహణపై సంబంధిత కౌంటింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు రావీష్ గుప్తా, అదనపు కలెక్టర్లు జే.అరుణ శ్రీ, జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్, దివాకర్ లతో కలిసి పాల్గొన్నారు. కలెక్టర్, పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, ర్యాండమైజేషన్ చేపట్టి అసెంబ్లీ సెగ్మెంట్ వారీగా కౌంటింగ్ సిబ్బందిని కేటాయించామని, కౌంటింగ్ రోజు ఉదయం 5 గంటలకు టేబుల్ వారీగా కౌంటింగ్ సిబ్బంది కేటాయింపు చేస్తామని అన్నారు. కౌంటింగ్ సిబ్బంది ఉదయం 5 గంటల వరకు తప్పనిసరిగా కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలని, సిబ్బంది తప్పనిసరిగా తమ గుర్తింపు కార్డులు తీసుకుని రావాలని, కౌంటింగ్ హాల్ లోపలికి సెల్ ఫోన్ అనుమతి ఉండదని, ఈ విషయాన్ని సిబ్బంది గమనించాలని కలెక్టర్ సూచించారు. జూన్ 4న ఉదయం 8 గంటలకు జేఎన్టీయు కళాశాల నందు పెద్దపల్లి పార్లమెంట్ పరిధి లోని పెద్దపల్లి, మంథని, రామగుండం , ధర్మపురి అసెంబ్లీ సెగ్మెంట్ లకు సంబంధించిన ఓట్ల లెక్కింపు ప్రారంభమవు తుందని అన్నారు. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ కౌంటింగ్ హాల్ లో 14 టేబుల్స్ ఉంటాయని, వీటి వివరాలను కంప్యూటర్ లో నమోదు చేసేందుకు నలుగురు ఆపరేటర్లను కంప్యూటర్ లతో ప్రత్యేకంగా నియమించామని, వీరి మధ్య మెరుగైన సమన్వయం కోసం కలర్ డ్రెస్ కోడ్ ఏర్పాటు చేశామని అన్నారు. కౌంటింగ్ హాల్ లో కంప్యూటర్ సి1 పరిధిలో టేబుల్ సంఖ్య 1,2,3,4 సిబ్బంది రెడ్ షర్ట్ లు ధరిస్తారని, కంప్యూటర్ సి2 పరిధిలో టేబుల్ సంఖ్య 5,6,7 సిబ్బంది గ్రీన్ షర్ట్ లు ధరిస్తారని, కంప్యూటర్ సి3 పరిధిలో టేబుల్ సంఖ్య 8,9,10,11 సిబ్బంది బ్లూ షర్ట్ లు ధరిస్తారని, కంప్యూటర్ సి4 పరిధిలో టేబుల్ సంఖ్య 12,13,14 సిబ్బంది యెల్లో షర్ట్ లు ధరిస్తారని కలెక్టర్ తెలిపారు. కౌంటింగ్ నాడు ఉదయం 7-30 గంటలకు ఎన్నికల పరిశీలకులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్ ఓపెన్ చేయడం జరుగుతుందని, ప్రతి కౌంటింగ్ హాల్ లోకి టేబుల్ వద్ద కంట్రోల్ యూనిట్లను తీసుకొని వస్తారని, కౌంటింగ్ సిబ్బంది తమకు కేటాయించిన కంట్రోల్ యూనిట్ వచ్చిందా లేదా ముందుగా పరిశీలించి, అనంతరం కంట్రోల్ యూనిట్ సీల్ పరిశీలించాలని తెలిపారు. ప్రతి కౌంటింగ్ టేబుల్ వద్ద అవసరమైన మేర అదనంగా బ్యాటరీలు ఏర్పాటు చేశామని, కంట్రోల్ యూనిట్ ఆన్ కాని పక్షంలో బ్యాటరీ చేంజ్ చేయాలని, ఒకవేళ కంట్రోల్ యూనిట్ ఇన్ వాలిడ్ అని వచ్చినా, కంట్రోల్ యూనిట్లలో మొత్తం ఓట్లు, ఫారం 17సి పార్ట్ 1 తో సరిపోకపోతే వెంటనే సదరు కంట్రోల్ యూనిట్లను సహాయ రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకొని రావాలని అన్నారు. కంట్రోల్ యూనిట్ లో నమోదైన మొత్తం ఓట్లు, ఫారం 17సి పార్ట్ 1 తో సరిపోయిన నేపథ్యంలో రిజల్ట్ బటన్ నొక్కి కౌంటింగ్ ఏజేంట్లకు ఫలితాలు చూపిస్తూ, కౌంటింగ్ సూపర్ వైజర్లు సదరు వివరాలను ఫారం 17సి పార్ట్ 2 నందు కార్బన్ కాపీతో నమోదు చేయాలని, మొత్తం 42 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని, అధికారులు ఓపికతో వివరాలు సరిగ్గా నమోదు చేయాలని, అనంతరం కౌంటింగ్ ఏజెంట్ల సంతకాలు తీసుకుని సదరు కాపీలను సహాయ రిటర్నింగ్ అధికారికి సమర్పించాలని కలెక్టర్ సూచించారు.

# కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి- కలెక్టర్, పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్



పెద్దపల్లి, జూన్ -03: జిల్లాలో జరిగే లోక్ సభ ఎన్నికల కౌంటింగ్ నిర్వహణకు సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు కలెక్టర్, పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఎన్నికల సాధారణ పరిశీలకులు రావీష్ గుప్తా, అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ తో కలిసి ఆన్ లైన్ ద్వారా కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో పెద్దపల్లి, మంథని, రామగుండం, ధర్మపురి అసెంబ్లీ సెగ్మెంట్ కౌంటింగ్ రామగిరి లోని మంథని జేఎన్టీయూ కళాశాలలో జరుగుతుందని అన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు, 4 అసెంబ్లీ సెగ్మెంట్ ల ఈవిఎం ఓట్ల లెక్కింపు కోసం ర్యాండమైజేషన్ ద్వారా అసెంబ్లీ సెగ్మెంట్ ల వారీగా కౌంటింగ్ సిబ్బందిని కేటాయించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 81 మంది సిబ్బందిని బృందాల వారీగా ఆన్ లైన్ సాఫ్ట్ వేర్ వినియోగించుకొని పారదర్శకంగా కేటాయించడం జరిగిందని అన్నారు. ఈ ర్యాండమైజేషన్ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏ.ఓ. శ్రీనివాస్, డి.టి. ప్రవీణ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆధ్వర్యంలో పకడ్బందీ ఏర్పాట్లు



ఈనెల 4వ తేదీ మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపునకు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సారథ్యంలో యంత్రాంగం సర్వం సిద్ధం చేశారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టారు. ఈ నెల 13వ తేదీన పార్లమెంటు ఎన్నికల పోలింగ్ జరిగింది. మొత్తం 28 మంది అభ్యర్థులు పోటీ చేశారు. పార్లమెంట్ పరిధిలో మొత్తం 17,97,150 మంది ఓటర్లు ఉండగా, 13,03,690 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ శాతం 72.54 నమోదయింది. వయోవృద్ధులు దివ్యాంగులు 1625 మంది ఉండగా, హోమ్ ఓటింగ్ ద్వారా 1560 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ సిబ్బంది 10, 200 మంది ఉండగా 8,811 మంది, సర్వీస్ ఓటర్స్ 1018 మంది ఉండగా, 476 మంది ఓటు హక్కు సద్వినియోగం చేసుకున్నారు. పోలింగ్ పూర్తయిన తర్వాత 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలను కరీంనగర్ లోని ఎస్ఆర్ఆర్ డిగ్రీ కాలేజీలో స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. ఈ మేరకు ఎస్ఆర్ఆర్ కాలేజీలో ఓట్ల లెక్కింపునకు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సారథ్యంలో అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల కమిషన్ సూచించిన నిబంధనల మేరకు సర్వం సిద్ధం చేశారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు వేరువేరుగా ఓట్ల లెక్కింపును నిర్వహించనున్నారు. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో 395 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 18 టేబుల్స్ 22 రౌండ్లు, చొప్పదండి లోని 327 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 14 టేబుల్స్, 24 రౌండ్లు, వేములవాడ లోని 260 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 14 టేబుల్స్ 19 రౌండ్స్ వారీగా ఓట్లను లెక్కించనున్నారు. సిరిసిల్ల 287 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 14 టేబుల్స్ 21 రౌండ్స్, మానకొండూర్ 316 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 14 టేబుల్స్ 23 రౌండ్స్, హుజురాబాద్ 305 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 14 టేబుల్స్ 22 రౌండ్స్, హుస్నాబాద్ 304 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 14 టేబుల్స్ 22 రౌండ్ల వారీగా ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. ఆయా నియోజకవర్గాలకు సంబంధించి ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. కౌంటింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఆయా పార్టీల అభ్యర్థులు, ఏజెంట్ల కోసం సీట్లు కేటాయించారు. లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. విద్యుత్తు నిరంతరయంగా ఉండేలా చర్యలు అధికారులు తీసుకుంటున్నారు. కౌంటింగ్ కోసం సిబ్బందిని నియోజకవర్గంలో వారీగా సైతం అలాట్ చేశారు. దీనికోసం సెకండ్ రాండనైజేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ పమేలా ఆధ్వర్యంలో నిర్వహించారు. కౌంటింగ్ సూపర్వైజర్స్ 124 మంది, కౌంటింగ్ అసిస్టెంట్లు 124, మైక్రోఅబ్జర్వర్లు 124 మందిని కేటాయించారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు కౌంటింగ్ సూపర్వైజర్స్ 21, కౌంటింగ్ అసిస్టెంట్లు 35, మైక్రో అబ్జర్వర్లు 14 మందిని అలాట్ చేశారు. మంగళవారం ఉదయం 6 గంటలకు వీరిని టేబుల్స్ వారీగా కేటాయించనున్నారు. వీరందరికీ ఇప్పటికే ఓట్ల లెక్కింపుపై శిక్షణ ఇచ్చారు. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించనున్నారు. ఎనిమిదిన్నర గంటల నుంచి ఈవీఎంల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఎన్నికల ఫలితాలను రౌండ్ల వారీగా ప్రకటించనున్నారు. ఈ మేరకు ఎప్పటికప్పుడు ఫలితాలను ఎన్నికల కమిషన్ వెబ్సైట్ తో పాటు ఎంకోర్ సాఫ్ట్వేర్ లో నమోదు చేయనున్నారు. కరీంనగర్ సీపీ అభిషేక్ మోహంతి ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రత ఏర్పాటు చేశారు. కౌంటింగ్ సందర్భంగా ఏలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మంగళవారం 144 సెక్షన్ అమలు చేయనున్నారు. ఉదయం 6 గంటల నుంచి కౌంటింగ్ ముగిసే వరకు ఎస్ఆర్ఆర్ డిగ్రీ కాలేజీ ఎదుట ఉన్న రోడ్డుపై రాకపోకలకు అనుమతి లేదు. ఈ మేరకు పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

Edited, Printed, Published and Owned by B. Narsingh, Printed at Vijetha Graphics & Offset Printers, H.No. 19-6-109, Godavarkhani,Karimnagar, Telangana State.
Published at H.No. 15-4-76/4, Jawaharnagar, Godavarikhani, Karimnagar, Telangana State,. Editor B. Narsingh, Email : kranthi995@gmail.com, tnfocus5@gmail.com
Website : telangananundifocus.com Cell : 7995282199, 9959954795.